

గ్రామ సచివాలయాల్లో నగదురహిత లావాదేవీలు

ఏలూరు: జిల్లాలో అన్ని గ్రామ సచివాలయాల్లో నగదురహిత లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 15 నుండి నగదు రహిత చెల్లింపుల ప్రారంభిస్తూ ముద్రించిన గోడపత్రికను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెసి బి.లావణ్యవేణి, డిఆర్ఓ ఎవిఎన్ఎస్ మూర్తి, డిపిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, జెడ్‌పి సిఇఒ రవికుమార్, డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ, ఎల్‌డిఎం నీలాద్రిలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఈనెల 15వ తేదీ నుండి నగదు రహిత లావాదేవీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన లావాదేవీలను క్యూఆర్ స్కానర్ ద్వారా నగదు రహిత లావాదేవీల ప్రక్రియ పూర్తిచేసినట్లు కలెక్టర్ తెలిపారు. దీనిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

బియ్యం పక్కదారి..!

- రేషన్ సరఫరా వాహనాలే అడ్డా..!
- బియ్యం ఇచ్చేది వారే.. కొనేది వారే
- కిలో రూ.పదికి కొనుగోలు
- వందలాది మెట్రిక్‌టన్నులు పక్కదారి
- మార్కెట్‌లో అధిక ధరకు విక్రయం
- తూతూమంత్రంగా విజిలెన్స్ తనిఖీలు
- యథేచ్ఛగా అమ్మకం.. కొనుగోలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రేషన్ బియ్యం దందా రెండు జిల్లాల్లోనూ యథేచ్ఛగా సాగుతోంది. 'ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేడన్న' చందంగా ఈ బియ్యం దందా సాగుతోంది. ప్రభుత్వం రేషన్ సరఫరాకు ఏర్పాటు చేసిన వాహనాల్లోనే ఈ వ్యాపారం సాగడం విశేషం. రేషన్ బియ్యం ఇచ్చేది వారే.. తిరిగి కొనుగోలుచేసేది వారేకావడం విశేషం. జిల్లాలో ఈ తతంగం యథేచ్ఛగా సాగుతోంది. కట్టడి చేయాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు రోడ్లపై వాహనాలు తనఖీచేసి ఒకటి అర పట్టుకోవడం తప్ప.. రేషన్ బియ్యం దందా జరిగే మూలాలపై అధికారులు దృష్టిసారించని పరిస్థితి నెలకొంది. రెండు జిల్లాల్లో దాదాపు 11.73 లక్షల వరకూ అన్నపూర్ణ, అంత్యోదయ, తెల్ల రేషన్‌కార్డుదారులున్నారు. ఏలూరు జిల్లాలో 6.39 లక్షల వరకూ ఉండగా, పశ్చిమలో 5.33 లక్షలకు పైగాకార్డులున్నాయి. రేషన్ సరుకులు ఇంటికి అందించేవిధంగా ప్రభుత్వం ఎమ్‌డియుఎస్ వాహనాలను ఏర్పాటు చేసింది. ఏలూరు జిల్లాలో 408, పశ్చిమలో 343 మొత్తం 751 రేషన్ వాహనాలున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ప్రతినెలా ఏలూరు జిల్లాలో తొమ్మిదివేలకుపైగా మెట్రిక్ టన్నుల బియ్యం, పశ్చిమగోదావరి జిల్లాలో ఏడువేలకు పైగా మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్‌వాహనాల ద్వారా పంపిణీ అవుతోంది. జిల్లాలో ఎన్నో కుటుంబాలు రేషన్ బియ్యంపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. బియ్యం నాణ్యతలేవన్న కారణంగా దాదాపు 40 శాతం రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నట్లు సమాచారం. నాణ్యమైన బియ్యం అందించి రేషన్ బియ్యం అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

రెచ్చిపోతున్న బియ్యం మాఫియా

రేషన్ కార్డుదారుల నిస్సహాయతను ఆసరాగా చేసుకుని జిల్లాలో రేషన్ బియ్యం మాఫియా రెంచ్చిపోతుంది. అందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రేషన్ పంపిణీ వాహనాలే వేదికగా మారడం విశేషం. ప్రతినెలా రేషన్ బియ్యం అందించే వాహనదారులే లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. కిలో రూ.పదికి కొనుగోలు చేసి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. ప్రతినెలా ఇది పెద్దఎత్తున సాగుతోంది. నడిరోడ్డుపై ఈ వ్యాపారం సాగిపోతున్నప్పటికీ అడిగే నాథుడే లేకుండా పోయాడు. రేషన్‌వాహనాలను తనిఖీలు చేస్తే ఎన్ని కేజీల బియ్యం విక్రయించారు. వాహనాల్లో ఎంత బియ్యం ఉందో ఇట్టే తెలిసిపోతుంది. అయినప్పటికీ ఏ ఒక్క అధికారీ పట్టించుకోవడం లేదు. సామాన్య ప్రజానీకం నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా తరలించేస్తున్నారు. రోడ్లపై విజిలెన్స్ అధికారులు నిర్వహించే తనిఖీల్లో ఒకటి, అర మాత్రమే పట్టుబడుతున్నాయి. రోడ్లపై తనిఖీలు చేయడం తప్ప అసలు రేషన్ బియ్యం దందా మూలాలను మాత్రం ఏ ఒక్కరూ గుర్తించడం లేదు. రేషన్ వాహనాలు వచ్చిన తర్వాత రేషన్ బియ్యం దందా మూడు పువ్వులు, ఆరుకాయలు అన్నట్లు సాగుతుంది. ఈ దందాకు అడ్డుకట్ట వేయాలని అంతా కోరుతున్నారు. అదే సమయంలో జనాలు మెచ్చే నాణ్యమైన బియ్యం రేషన్ వాహనాల్లో ప్రభుత్వం అందిస్తే ప్రయోజనం ఉంటుంది.



మొలకలు వచ్చిన కొబ్బరి కాయలతో ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

కదం తొక్కిన కొబ్బరి రైతులు

మొలకలు వచ్చిన కొబ్బరికాయలతో కలెక్టరేట్ వద్ద ధర్నా


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొబ్బరి రైతులు కదం తొక్కారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద ఎపి రైతు సంఘం, కొబ్బరి రైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళనకు దిగారు. కొబ్బరికాయలను కొనుగోళ్లు లేకపోవడంతో మొలకలు వచ్చిన, ఎండిన కొబ్బరికాయలను కలెక్టరేట్ ముందు వేసి ధర్నా నిర్వహించారు. కొబ్బరిరైతులను ఆదుకోవాలంటూ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. నష్టాల్లో ఉన్న కొబ్బరి రైతులకు ఆత్మహత్యలే శరణ్యమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కొబ్బరి కొనుగోలు కేంద్రాలు తెరవాలని, గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు బిమ్మిడ్డి నరసింహ, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం అధ్యక్షులు బొల్లి రామకృష్ణ మాట్లాడారు. కొబ్బరి రైతుల సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. రాష్ట్రంలో మూడు లక్షల 50 వేల, ఏలూరు జిల్లాలో 35 వేల ఎకరాల్లో కొబ్బరి తోటలు విస్తరించి ఉన్నాయని చెప్పారు. కొబ్బరికి కనీస ధర కూడా రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొబ్బరి చెట్ల నుండి రాలిన కాయలను గుట్టగా పోయడానికి అయ్యే ఖర్చులు కూడా రాకపోవడంతో తోటల్లోనే ఉంచివేయడంతో మొలకలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రైతులకు కొబ్బరికాయకు రూ.ఐదు నుండి రూ.ఆరు మాత్రమే ధర వస్తోందన్నారు. వినియోగదారులకు మాత్రం నాణ్యమైన కొబ్బరికాయను రూ.30పైగా అమ్ముతున్నారన్నారు. ఎర్ర నల్లి, తెల్ల దోమ వంటి తెగుళ్ల వల్ల దిగుబడి తగ్గిపోయిందని చెప్పారు. కొబ్బరికాయలు చెట్టు నుండి కోసుకునేందుకు వ్యాపారులు గతేడాది వరకూ రూ.వెయ్యి నుండి రూ.1200 వరకూ ధర ఇచ్చేవారని, ప్రస్తుతం రూ.600 నుండి రూ.700 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో కొబ్బరి రైతులకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతులకు అనుమతులు ఇవ్వడం వల్ల దేశీయ మార్కెట్‌లో కొబ్బరికి ధర పడిపోయిందని చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తులకు ధర రాని సమయంలో ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపచేస్తామని ప్రభుత్వం గొప్పగా చెబుతున్నా ఆచరణలో అమలు లేదని విమర్శించారు. ఎకరా కొబ్బరి సాగుకు ఏడాదికి రూ.40 వేలకు పైగా ఖర్చవుతుందని కనీస పెట్టుబడి ఖర్చులు కూడా రాక నష్టాల్లో కూరుకుపోతున్న కొబ్బరి రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాఫెడ్, ఆయిల్ ఫెడ్‌లను వెంటనే రంగంలోకి దింపి కొబ్బరి కొనుగోలు కేంద్రాలు తెరవాలని కోరారు. కొబ్బరి రైతులకు ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపచేయాలన్నారు. విదేశీ కొబ్బరి దిగుమతులను నిషేధించాలని కోరారు. జిల్లాలో కొబ్బరి ఆధారిత పరిశ్రమలను సహకార రంగంలో ఏర్పాటు చేయాలన్నారు. ఎర్ర నల్లి, తెల్ల దోమ వంటి తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందించాలని, ఉద్యాన వన శాఖ ద్వారా సబ్సిడీ పథకాలు అమలు చేయాలని కోరారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించొద్దని, ఉచిత విద్యుత్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కొబ్బరి రైతులను ఆదుకోకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

అనంతరం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంతమంది రైతుల వద్ద ఎన్ని క్వింటాళ్లు దిగుబడి ఉందో తెలుసుకొని దాని ఆధారంగా కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పానుగంటి అచ్యుతరామయ్య, గంటా పాపారావు, గుడిబండి రమేష్‌రెడ్డి, వేగుంట సురేష్ బాబు, తాతిన రమేష్, బొప్పన సుధాకర్, గద్దే రాంబాబు, వైదికి శ్రీకృష్ణారావు, పి.బలరామరాజు, కెఆర్.రాయ్, బూరుగుపల్లి రామకృష్ణ, పి.రామభద్రరాజు, బి.గోవర్ధనరావు, పి.కృష్ణ ప్రసాదరెడ్డి, పి.నరసింహారావు, బొప్పూడి రాంబాబు పాల్గొన్నారు.

భూస్వాములకు 'అసైన్డ్'ను కట్టబెట్టేందుకే చట్టసవరణ

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు - సంఘం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా



డిఆర్‌ఒకు వినతిని అందిస్తున్న నేతలు, పేదలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భూస్వాములకు ఎసైన్డ్ భూములను కట్టబెట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఎసైన్డ్ చట్ట సవరణ చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు విమర్శించారు. దేశానికీ స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లు గడుస్తున్నా నేటికీ పేదల భూములు భూస్వాముల కబంధహస్తాల్లోనే ఉన్నాయన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులు, పేదలు, దళితులు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటం చేసిన ఫలితంగా 9/77 చట్టం వచ్చిందని, కానీ నేడు ప్రభుత్వం అసైన్డ్ భూములను అక్రమంగా అనుభవిస్తున్న వారికే యాజమాన్యపు హక్కులు కల్పిస్తూ చట్ట సవరణ చేయడం దుర్మార్గమని వెంకటేశ్వర్లు విమర్శించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ముందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసైన్మెంట్ భూముల ఆర్డినెన్స్ సవరణల నిర్ణయం వల్ల అసైన్డ్‌దారుల కంటే అక్రమంగా, దౌర్జన్యంగా అనుభవిస్తున్న భూస్వాములే ఎక్కువ ప్రయోజనం పొందే అవకాశం ఉందని మండిపడ్డారు. గతంలో కూడా అసైన్డ్ చట్ట సవరణ వల్ల పేదలకంటే అనర్హులే ఎక్కువ లబ్ధి పొందారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో అసైన్డ్ లబ్ధిదారుల లిస్టులను గ్రామ సచివాలయంలో బహిరంగపరచాలని కోరారు. అందులో అర్హులకే యాజమాన్యపు హక్కుని కల్పించాలన్నారు. అక్రమంగా అనుభవిస్తున్న వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 17,21,160 కుటుంబాలకు చెందిన 27,41,609 ఎకరాల అసైన్డ్ భూముల వివరాలు ప్రతీ గ్రామ సచివాలయంలో బహిరంగపరచాలని కోరారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సుల మేరకు సీలింగ్ భూములతో పాటు పేదలకు పంచడానికి అవకాశమున్న అన్ని రకాల భూములను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. భూ సమస్యలలో పోలీసుల జోక్యం ఉండకూడదన్నారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ దెందులూరు మండలం దోసపాడులో సాగుచేస్తున్న అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ద్వారకాతిరుమల మండలంలో వందలాది ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని, లింగపాలెం, చింతలపూడి మండలాల్లో నేటికీ భూస్వాముల కబంధహస్తాల్లోనే వేలాది ఎకరాలు అసైన్మెంట్ భూములున్నాయని తెలిపారు. టి.నరసాపురం మండలం అల్లూరి సీతారామరాజునగర్‌లో ఇళ్లస్థలాల సమస్యలు పరిష్కరించాలన్నారు. రామమ్మగూడెం భూ సమస్య, బచ్చులేటిగూడెం అటవీ భూ సమస్యలు పరిష్కరించడంలో మండల రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు వైఫల్యం చెందారని మండిపడ్డారు. జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెం, కేతవరం, చక్రదేవరపల్లి, గురవాయిగూడెం గ్రామాల్లో ఉన్న ల్యాండ్ సీలింగ్ భూములను ఆక్రమించుకున్న భూస్వాముల నుండి భూమి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో భూ రికార్డులు అవకతవకలు జరుగుతున్నాయని మండిపడ్డారు. రెండు మండలాల తహశీల్దార్‌లు రికార్డులు తారుమారు చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే పేరుతో భూములను భూస్వాములకు కట్టబెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రకాలువ మిగులు భూముల్లో పేదల సాగుకు అవకాశం కల్పిస్తూ ఏక్‌సాల్ పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. మిగులు భూముల్లో పశుపోషణకు, వ్యవసాయానికి పేదల ఉపయోగించుకుంటుంటే వాటికి పట్టాలు ఇవ్వకపోగా పోలీసులతో నిర్బంధించి అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఇరిగేషన్ భూముల్లో పోలీసుల దౌర్జన్యం ఏమిటని ప్రశ్నించారు. 2013 భూ సేకరణ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తామా ముత్యాలమ్మ, జిల్లా కమిటీ సభ్యులు మడకం సుధారాణి, టి.సత్యనారాయణ, ఎస్.మహంకాళీరావు, ఎ.ప్రభాకర్ మాట్లాడారు.

అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ బృందం డిఆర్‌ఒకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమస్యలను ఆర్‌డిఒ, జెసి, కలెక్టర్ దష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.దాసు, ఎన్.సుబ్బారావు, రామలక్ష్మి, దుర్గ, రుక్మిణి, కె.సుబ్బారావు పాల్గొన్నారు.

సకాలంలో స్పందన అర్జీలు పరిష్కారం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

స్పందనలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ధేశించిన గడువులోగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. సోమనవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం స్పందన అర్జీల స్వీకరణ పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెసి బి.లావణ్యవేణి, డిఆర్ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, జెడ్‌పి సిఇఒ రవికుమార్, డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ, ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్, వ్యవసాయశాఖ జెడి రామకృష్ణతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ స్పందనలో ఆయాశాఖల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గృహమంజూరు, ఉపాధి అవకాశాలు, రెవెన్యూ సేవలు, సర్వే, భూ తగాదాలు, పింఛన్లు తదితర అంశాలపై అర్జీలు స్వీకరించారు. జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమంలో 473 అర్జీలు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఆయా శాఖాధికారులు, సిబ్బందితో జెండా ఆవిష్కరణ చేయాలని సూచించారు. స్పందనలో వచ్చిన అర్జీలను రీ ఓపెనింగ్ లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించి అర్జీలను పరిష్కరించి అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. అర్జీల పరిశీలనలో భాగంగా నియమించిన జిల్లా ఆడిట్ అధికారులు అర్జీల పరిశీలనలో ప్రత్యేకమైన శ్రద్ధ కనబరచాలని అన్నారు.



ఎంపీకి వినతిని అందిస్తున్న ప్రజలు

1300 ఎకరాల్లో నేవల్ బేస్ క్యాంపు : ఎంపీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పోలవరం నియోజకవర్గంలో నేవల్ ఏర్పాటుకు 1300 ఎకరాల భూమి అవసరమవుతుందని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం స్థానిక వైసిపి నాయకులు మేడవరపు విద్యాసాగర్ ఇంటికి వచ్చిన ఎంపీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పోలవరం నియోజకవర్గంలో నేవల్ బేస్ క్యాంపు ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే పేపర్ వర్క్ పూర్తయిందని, నిర్మాణం కోసం 1300 ఎకరాల భూ సేకరణకు సన్నాహాలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. సిఎం జగన్ పరిపాలనలో సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేయడంతో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలు సమస్యలు పరిష్కరించాలని వినతులు అందించారు.

పోలవరంలో భారీ వర్షం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో ఇటుకలకోట, బోడీగూడెం, వింజరం, ప్రగడపల్లి, పోలవరం, కమ్మరగూడెం, నూతనగూడెం, పాత పట్టిసీమ, పట్టిసీమ గూటాల గ్రామాల్లో ఆదివారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకూ భారీ వర్షం కురిసింది. ఎదురుగాలులతో కూడిన వర్షానికి రోడ్లు, డ్రెయిన్లు పొంగిపొర్లాయి.



పోలవరంలో కురుస్తున్న వర్షం

శ్రీనివాసపురం సర్పంచిగా రాధిక ఏకగ్రీవం



శ్రీనివాసపురం సర్పంచిని అభినందిస్తున్న ఎంఎల్ఎ ఎలిజా


ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని శ్రీనివాసపురం సర్పంచి ఎన్నిక ఏకగ్రీవమైంది. నాలుగు నామినేషన్లు దాఖలు కాగా సోమవారం నామినేషన్ల ఉపసంహరణలో జొన్నకూటి శ్రీనివాసరావు, తడికల మోహన్‌రావు, యడ్లపల్లి సత్యవతి తమ నామినేషన్లు ఉప సంహరించుకున్నారు. దీంతో సర్పంచిగా యడ్లపల్లి రాధిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సురేష్ నియామకపత్రాన్ని అందజేశారు. సర్పంచిగా పనిచేస్తూ అనారోగ్యంతో యడ్లపల్లి దుర్గారావు మృతిచెందడంతో ఉపఎన్నిక అనివార్యమైంది. దుర్గారావు సతీమణి రాధిక సర్పంచిగా నామినేషన్ వేశారు. ఆఖరి నిమిషం వరకూ ఎన్నికలు జరుగుతాయని ఉత్కంఠ నెలకొంది. కానీ మిగతా వారు తమ నామినేషన్‌లు ఉపసంహరించుకున్నారు. దీంతో వైసిపి బలపరచిన అభ్యర్థి యడ్లపల్లి రాధిక ఏకగ్రీవంగా సర్పంచి పదవి దక్కించుకున్నారు.

వణుదుర్రు సర్పంచి బరిలో నలుగురు అభ్యర్థులు

ముదినేపల్లి : మండలంలోని వణుదుర్రు గ్రామ సర్పంచి ఉపఎన్నికకు నలుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం తొమ్మిది మంది సర్పంచి ఉపఎన్నికకు నామినేషన్లు వేశారు. అందులో ఐదుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను సోమవారం ఉపసంహరించుకున్నారు. దీంతో నాలుగురు అభ్యర్థులు మిగిలారు. వీరిలో వైసిపి బలపరచిన అభ్యర్థిగా చిన్నం సుగుణబాబు కాగా, టిడిపి తరపున చిన్నం వెంకటేశ్వరరావు, తోట వెంకటేశ్వరరావు బరిలో ఉన్నారు. జనసేన బలపరచిన అభ్యర్థి కోనాల శ్రావణి బరిలో నిలిచారు. ఈ నెల 19వ తేదిన ఎన్నిక జరగనుంది.


అలాగే మండలంలోని పెయ్యేరు పంచాయతీ రెండో వార్డు సభ్యుని ఉప ఎన్నికలో టిడిపి బలపరచిన అభ్యర్థి దూబ నిర్మల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ వార్డుకు మొత్తం ముగ్గురు అభ్యర్థులు పోటీలో ఉండగా కోటే రమేష్, గుండాబత్తిన సురేష్ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో నిర్మల ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు నిర్మలను పూలమాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు లోబడి, డిఎన్ఆర్ అదేశాల మేరకు మానవాతా దృక్పథంతో నిర్మల కుటుంబసభ్యుల అభ్యర్ధన మేరకు తమ అభ్యర్థి కోటే రమేష్, గుండాబత్తిన సురేష్ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు తెలిపారు.



ముదినేపల్లి : నిర్మలకు ఎన్నిక ధృవీకరణ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి

సమస్యలు పరిష్కరించాలని పోలవరం నిర్వాసితుల వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం



ఐటిడిఎ పిఒకు వినతిని అందిస్తున్న నేతలు

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ మహాసభ ఆధ్వర్యాన ఐటిడిఎ పిఒ సూర్యతేజకు కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల నిర్వాసితులు, గిరిజనులు సోమవారం వినతిని అందించారు. ఈ సందర్భంగా మహాసభ జిల్లా అధ్యక్షులు మీడియం వెంకటస్వామి, జిల్లా ప్రధానకార్యదర్శి మూలం రాంబాబు, జిల్లా సహాయ కార్యదర్శి మీడియం వెంకటేష్ మాట్లాడారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులకు ప్యాకేజీ సమస్యలు, ప్యాకేజీ చెల్లింపులో భాగంగా ఎకౌంటు నంబర్లు, పేర్ల నమోదులో సమస్యలు పరిష్కరించాలన్నారు. గిరిజన చట్టాలు అమలు చేయాలని కోరారు.

వైసిపి హయాంలో మహిళలకు రక్షణ కరువు : టిడిపి

ప్రజాశక్తి - పోలవరం



ప్రజలకు టిడిపి మేనిఫెస్టో బ్రోచర్లు అందిస్తున్న నాయకులు

వైసిపి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని మాజీ ఎంఎల్ఎ, పోలవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్ విమర్శించారు. మండల కేంద్రం పోలవరం పంచాయతీ పరిధిలోని గణేష్‌నగర్‌లో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మినీ మేనిఫెస్టోను కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ రెడ్డి పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే మహిళలు ఆర్థికంగా ఎదుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డు కృష్ణ, కుంచే దొరబాబు, ఎన్.రాంబాబు, పోతుల శ్రీనివాసరావు, పాదం ప్రసాద్, ఆకుల రాజా, సున్నం సుధీర్, మంగిన కొండ, పిల్లి నాగరాజు, కుంచే రాజేష్, , ఎడ్ల వినోద్, తెల్లం సూర్యచంద్రరావు, జితేంద్ర, నరసింహారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సర్వేలో పాల్గొన్న జిల్లా నోడల్ టీం లీడర్ కె.శ్రీనివాసరావు

17 వరకూ కుటుంబ సర్వే

ప్రజాశక్తి - చింతలపూడి

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఆరో దశలో ఎర్రగుంటపల్లి, గనిజర్ల గ్రామాలు గుర్తించబడ్డాయని జిల్లా నోడల్ టీం లీడర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఎర్రగుంటపల్లి పిహెచ్‌సిలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకూ సర్వే నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిగ్మా రీఛార్జ్ ఇన్స్టిట్యూట్ ప్రైవేట్ లిమిటెడ్ సత్తిపండు, ఎం.పార్వతీశం, టి.శ్రీనుబాబు, డి.సుబ్రహ్మణ్యం, ఎర్రగుంటపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి కె.నరేష్, డాక్టర్ మంజుష, జి.రమణమ్మ, ఆరోగ్య విస్తరణాధికారి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పవన్ వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడటం సరికాదు

ప్రజాశక్తి - పోలవరం

మొదటి విడత వారాహి యాత్ర ప్రారంభం నుంచి పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యలపై, స్థానిక సమస్యలపై మాట్లాడుతున్నారని, కానీ వైసిపి నాయకులు, మంత్రులు ప్రజా సమస్యల మీద మాట్లాడటం మానేసి పవన్‌కళ్యాణ్ వ్యక్తి గత జీవితం గురించి మాట్లాడటం, దూషించడం పనిగా పెట్టుకున్నారని జనసేన ఇంఛార్జి చిర్రి బాలరాజు తెలిపారు. సోమవారం జనసేన ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన అడిగిన ప్రశ్నలకు సమాధానాలు మాత్రం రావడం లేదన్నారు. తీసే సినిమాలు మీద రివ్యూలు చెప్పడం, ఆయన మాట్లాడిన మాటలు వ్యంగంగా వక్రీకరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు గుణపర్తి చిన్ని, పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డిసిఒను కలిసిన సహకార ఉద్యోగులు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

సహకారశాఖ డిఆర్ఒ కార్యాలయాన్ని జిల్లా సహకార శాఖ అధికారి(డిసిఒ) ఎండి మిల్టన్ సోమవారం పర్యవేక్షించారు. డిసిఒ రాక సందర్భంగా నూజివీడు నియోజకవర్గ పరిధిలోని సహకార సంఘాల ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిసిఒ మాట్లాడుతూ సొసైటీలు కార్పొరేట్ బ్యాంకులకు ధీటుగా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీలం నాగేశ్వరరావు, దుర్గారావు, రంగారావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా స్థావరాలపై దాడి

25 లీటర్లు స్వాధీనం

ప్రజాశక్తి - చింతలపూడి

సారా స్థావరాలపై దాడి చేసినట్లుగా చింతలపూడి ఎస్ఇబి సిఐ సాయి స్వరూప్ తెలిపారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో చింతలపూడి సబ్ సిబ్బంది నాగిరెడ్డి గూడెం, నామవరం గ్రామాల్లో దాడులు చేశారు. నాగిరెడ్డిగూడేనికి చెందిన ధరావతు రమేష్, దేశావతు సావిత్రిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారాను, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే నామవరం గ్రామానికి చెందిన సోనీని అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్ల బండిని ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తికి, రెండు ఎద్దులకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని తాడువాయిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తాడువాయికి చెందిన కలపాల రామకృష్ణ తన ఎండ్ల బండితో సోమవారం వేకువ జామున జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెంలో కాలువ వద్దకు ఇసుక తెచ్చుకునేందుకు బయలుదేరాడు. గుర్తు తెలియని వాహనం ఎడ్ల బండిని తాడువాయి దాబా హోటల్ సమీపంలో ఢీకొట్టింది. దీంతో రామకృష్ణకు స్వల్పగాయాలు కావడంతో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన రెండు ఎద్దుల్లో ఒక ఎద్దు పరిస్థితి విషమంగా ఉండగా, మరో ఎద్దు తీవ్రంగా గాయపడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాగర్ బాబు తెలిపారు.

మహిళ అదృశ్యం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పల్లెర్లమూడి గ్రామానికి చెందిన కంభంపాటి దుర్గా పల్లవి(38) కనిపించడం లేదని ఆమె భర్త వరప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నూజివీడు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తెలిపారు. భర్త ఇచ్చిన సమాచారం మేరకు ఈనెల 13వ తేదీన ఇంటి నుంచి బయటకు వచ్చిన తరువాత కనిపించలేదని, గాలించినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆచూకీ తెలిసినవారు తమను సంప్రదించాలని పోలీసులు కోరారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

8 మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-నూజివీడు రూరల్

బొరవంచ గ్రామంలో సోమవారం ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న రావిచర్ల గ్రామానికి చెందిన పులపాక స్వరూప రాణి(28), రమణ(21), రంగమ్మ(32), మరియమ్మ(35), ముల్లంగి జ్యోతి(24) మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరందరూ వ్యవసాయ పనుల నిమిత్తము వెళు తుండగా ఈ ఘటన జరిగిందని వారు వివరించారు. స్థానికుల సమాచారంతో 108లో నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

రూ.2,200 స్వాధీనం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పేకాట శిబిరంపై దాడులు చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం మండలంలోని అంకన్నగూడెం శివారులో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు ఎస్ఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. ఈ దాడులలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఐదుగురు వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కారు బోల్తా : డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి


అతివేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి పల్టీ కొట్టిన సంఘటనలో కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలైయ్యాయి. ఈ ఘటన మండలంలోని చినపాలపర్రు వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే భీమవరం నుంచి విజయవాడ వెళ్తున్న కారు చినపాలపర్రు బస్‌షెల్టర్ సమీపంలో అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో ఉన్న కంకర గుట్టపైకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో భీమవరానికి చెందిన కారు డ్రైవర్ దాసరి రామారావు తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు సమాచారంతో క్షతగాత్రుని 108 వాహనంలో చికిత్సకై గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఆంజనేయ స్వామి ఆలయ హుండీ చోరీ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

దిగవల్లి గ్రామంలోని శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం తెల్లవారుజామున దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో హుండీని దొంగలించారు. ఈ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలు రూ.లక్ష వరకూ ఉండవచ్చునని స్థానికులు అంచనా వేస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నిధులున్నా.. వ్యక్తిగత కుళాయిలకు డిపాజిట్ల సేకరణ సరికాదు


అర్జీను సమర్పిస్తున్న ప్రజాస్వామ్య ఐక్యవేదిక సభ్యులు

ప్రజాశక్తి - మండవల్లి

జలజీవన్ మిషన్ ద్వారా లక్షల్లో నిధులు మంజూరు అయినప్పటికీ వ్యక్తిగత కుళాయిని ఇచ్చే విధంగా డిపాజిట్లు చెల్లించాలని మండవల్లి పంచాయతీ గ్రామసభ నిర్వహించడం సరికాదని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్ భాస్కరరావు విమర్శించారు. జల జీవన్ మిషన్ ద్వారా వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకుని ప్రతి ఇంటికీ ఉచితంగా కుళాయిని అందించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ రాజ్ కుమార్‌కు, ఎంపిడిఒ వెంకటరమణకు ఆయన అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జలజీవన్ మిషన్ అనే పథకాన్ని తీసుకువచ్చాయని ఆయన తెలిపారు. జలజీవన్ మిషన్ ప్రవేశ పెట్టడమే కాకుండా కుళాయిలను ఉచితంగా అందించే విధంగా రూ.69 లక్షల నిధులను మంజూరు చేయడం కూడా జరిగిందన్నారు. ఆ నిధులు మంజూరై సంవత్సర కాలం గడుస్తున్నా నేటికీ మండవల్లి పంచాయతీలో ప్రతి ఇంటికి ఉచితంగా కుళాయి ఇచ్చే విధంగా చర్యలు చేపట్టలేదని అన్నారు. రూ.69 లక్షల నిధులను ఖర్చు చేసి ప్రతి ఇంటికీ ఉచితంగా కుళాయిని అందించకుండా, కుళాయి కావల్సిన ఎస్‌సి, ఎస్‌టిలు రూ.5,500 బిసి, ఒసిలు 7వేలు డిపాజిట్లు చెల్లించాలని గ్రామసభ నిర్వహించడం బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరైన రూ.69 లక్షల నిధులను వినియోగించి ఉచితంగా కుళాయిలను అందించకపోగా, డిపాజిట్లు చేయాలని మండవల్లి పంచాయతీ నిర్ణయించడం సరియైన నిర్ణయం కాదన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా విడుదలైన నిధులతో పుట్ల చెరువులో సుమారు 230 వ్యక్తిగత కుళాయిలను ఉచితంగా అందించారని గుర్తు చేశారు. జలజీవన్ మిషన్ నిధులను వినియోగించి గ్రామంలో ఉచితంగా మంచినీటి కుళాయిలను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని స్పందన ద్వారా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షులు అప్పారావు, మండల ప్రధాన కార్యదర్శి [illegible] పాల్గొన్నారు.


పైపులైన్లను పరిశీలిస్తున్న సర్పంచి

పంచాయతీ కుళాయిలు ఏర్పాటు

తాగునీటి ఎద్దడిని అధిగమించే విధంగా గ్రామంలో పంచాయతీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామని కానుకొల్లు సర్పంచి నాగదాసి థామస్ తెలిపారు. పంచాయతీ నిధులతో ఏర్పాటు చేస్తున్న పైపులైన్లను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఎస్‌సి కాలనీలో సీసీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ఆ ప్రాంతంలో ఉన్న గ్రామస్తులకు తాగునీటి అవసరాలు తీర్చే విధంగా పంచాయతీ నిధులు వెచ్చించి పైపులైన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణానంతరం కుళాయిలను వేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రత్నకుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ రమణారావు

విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - నిడమర్రు

రాష్ట్ర హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తుంటే, కేంద్ర ప్రభుత్వం ఆదేశాలకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తుందని, విద్యుత్ స్మార్ట్ మీటర్లను కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతుందని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు తెలిపారు. పేద ప్రజలపై గత మూడు, నాలుగు నెలలుగా విద్యుత్ భారాలు విపరీతంగా మోపుతుందని, నాణ్యమైన కరెంటు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగున్నర ఏళ్ల కాలంలో గ్రామాభివృద్ధి కుంటుపడిందన్నారు. 14, 15 కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడానికి ప్రయత్నిస్తుందన్నారు. రాబోయే కాలంలో అధిక ధరలకు నిరసనగా ఉద్యమం చేపడతామని సమావేశం తీర్మానం చేసింది. ఈ సమావేశంలో కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, కంచం వరప్రసాద్, లావేటి చంద్రావు, వెలగలేటి మోహన పాల్గొన్నారు.

ఆరో వార్డు బరిలో సిపిఎం అభ్యర్థిగా కెచ్చల రమణ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



ఈనెల 18న జరుగనున్న జీలుగుమిల్లి పంచాయతీ ఆరో వార్డు ఉప ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థిగా కెచ్చలా రమణ బరిలో నిలిచినట్లు పార్టీ జీలుగుమిల్లి కార్యదర్శి అప్పారావు తెలిపారు. సోమవారం నామినేషన్ల విత్ డ్రా అనంతరం సిపిఎం అభ్యర్థిగా రమణను పోటీలో నిలిపినట్లు ఆయన పేర్కొన్నారు. కెచ్చల రమణ ఎన్నికల గుర్తు గౌను గుర్తును కేటాయించినట్లు తెలిపారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

గొల్లపల్లి హైస్కూల్లో సోమవారం స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, 100 మీటర్ల రన్నింగ్, షార్ట్ పుట్ జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అంతేకాకుండా వ్యాసరచన పోటీలు, క్విజ్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పాఠశాల హెచ్ఎం పొట్లూరి రాధికా రాణి మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో ఎపిఎన్‌జిఒ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - ముదినేపల్లి

విజయవాడలో ఈనెల 21, 22 తేదిల్లో జరగబోయే ఎపిఎన్‌జిఒ రాష్ట్ర మహాసభలకు తప్పక తరలిరావాలంటూ సోమవారం ఆహ్వాన కరపత్రాలను అందజేశారు. మండవల్లి యూనిట్ అధ్యక్షులు ఎంవి సుబ్బారావు ఈమేరకు కరపత్రాలను మండల తహశీల్దార్ కె.శ్రీనివాస్‌తో పాటు కార్యాలయ ఉద్యోగులకు పంపిణీ చేశారు.

వివాదాస్పద భూముల్లో పోలీసుల పహారా

ప్రజాశక్తి - టి.నరసాపురం


అల్లంచర్లలో భద్రతా చర్యలు చేపట్టిన పోలీసులు

వివాదాస్పద అల్లంచర్ల అటవీ భూముల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. సోమవారం అటవీ ప్రాంతంలో పోలీసు సిబ్బందిని పహారా ఉంచి వారికి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గత కొంతకాలంగా అల్లంచర్ల రాజుపాలెం, కొత్తగూడెం పరిదిలో 226, 227 భూముల వివాదాల నేపథ్యంలో, ఇటీవల మరోసారి గొడవలు జరుగుతున్న క్రమంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు. జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులను నిఘా ఉంచామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు ఉన్నారు.

మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మణిపూర్ మారణకాండకు ఆ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం, సంఘ పరివార్ బాధ్యత వహించాలని, మణిపూర్ అల్లర్లకు కారణమైన దోషులందరినీ తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద అఖిల భారత రైతు కూలీ సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం, పిడిఎస్‌యుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గొప్ప ప్రజాస్వామ్య దేశమని చెప్పుకునే భారతదేశంలో ఉన్న వ్యవస్థలన్నీ మణిపూర్ మారణకాండను, మహిళలపై అత్యాచారాలను చవిచూశాయని, పోలీసుల సమక్షంలోనే ఈ దారుణాలు జరిగాయని విమర్శించారు. రాష్ట్రపతి, గవర్నర్, మహిళా కమిషన్, ఎస్‌టి కమిషన్, మానవ హక్కుల కమిషన్, ఇలా అందరూ తమ బాధ్యతను విస్మరించి మెజారిటీ వర్గానికి అండగా నిలబడ్డారన్నారు. రకరకాల కారణాలు చూపించి కుకీ, ఆదివాసి తెగలను అడవుల నుంచి ఖాళీ చేయించి అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టాలనే తపనతో మోడీ ప్రభుత్వం ఉందని ఆయన దుయ్యబెట్టారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు పార్వతి, నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం


ప్రభుత్వ కళాశాలలో తనిఖీ నిర్వహిస్తున్న డైరెక్టర్ డా.సి కృష్ణ

కళాశాల విద్య ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ డా.సి.కృష్ణ స్థానిక ప్రభుత్వ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. కళాశాలలో విద్యార్థులతో ముచ్చటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాల తాత్కాలిక భవనాన్ని పరిశీలించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో నూతనంగా నాలుగేళ్ల ఆనర్స్ కోర్సులు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. విద్యార్థులు నూతనంగా వచ్చే కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో అధ్యాపకుల అకడమిక్ రికార్డ్స్ పరిశీలించి పలు సూచనలు చేశారు. అధ్యాపకులు ఎప్పటికప్పుడు వారి పనితీరు మెరుగుపరుచు కోవాలని తెలిపారు. కళాశాలలో ఉన్న కంప్యూటర్, లైబ్రరీలను పూర్తి స్థాయిలో విద్యార్థులకు అందుబాటులోకి తీసుకుని రావాలని ఆదేశించారు. అసంపూర్తిగా నిలిచిన కళాశాల భవనాన్ని త్వరితగతిన పూర్తి చెయ్యడానికి సంబంధిత అధికారులను సంప్రదించాలని ప్రిన్సిపల్ డా.మనెంద్ర రావుకి సూచించారు. విద్యార్థినిలు వారి ఫిర్యాదులు కోసం కమిషనరేట్ ఈశీఘ్రం అనే యాప్‌ను ప్రవేశ పెట్టింది అని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. అనంతరం ప్రిన్సిపల్ డా.మనేంద్ర రావు, అధ్యాపకులు ప్రాంతీయ డైరెక్టర్ డా.కృష్ణని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మర్రి వెంకటేశ్వర రావు, అకడమిక్ కోఆర్డినేటర్ డా.అక్కులన్న, అధ్యాపకులు శ్రీలక్ష్మి, సునీత, భాగ్య లక్ష్మి, శ్రీను, రవికుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్

ప్రజాశక్తి - చింతలపూడి

కోర్టులో పెండింగ్ కేసుల భారం ఎక్కువ వుందని, దానిని తగ్గించుటకు లోక్ అదాలత్‌లు ఎంతగానో తోడ్పడుతున్నాయని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సి.మధు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడిలో సెప్టెంబర్ 9వ తేదీన జరుగు జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చెయ్యాలని, పోలీస్ అధికారులకు సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లపై పోలీస్ వారు కక్షిదారులకు అవగాహన కల్పించి, రాజీ మార్గం వైపు తీసుకు వచ్చి కేసులు సామరస్య పూర్వకంగా రాజీ చెయ్యాలని సూచించారు. ఇందులో ఎపిపి సామయ్య, చింతలపూడి సిఐ యంవియస్ మల్లేశ్వర రావు, తడికలపూడి ఎస్ఐ, ఎఎస్ఐలు, ధర్మాజీగూడెం, నరసాపురం, ఎక్సైజ్ స్టేషన్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

ప్రతిభలో ఘనంగా లెఫ్ట్ హ్యాండర్స్ డే


విద్యార్థులతో డైరెక్టర్ సుభాష్ రెడ్డి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక ప్రతిభా ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఇంటర్నేషనల్ లెఫ్ట్ హ్యాండర్స్ డే ఘనంగా నిర్వహించారు. సోమవారం ప్రపంచ లెఫ్ట్ హ్యాండర్స్ డే సందర్భంగా పాఠశాలలో 50 మంది ఎడమచేతి వాటం కలిగిన విద్యార్థులతో లెఫ్ట్ హ్యాండర్స్ డే నిర్వహించారు. అలాగే ప్రతిభా స్కూల్ డైరెక్టర్ సుభాష్ రెడ్డి, సోషల్ ఉపాధ్యాయుడు తమ్మయ్యది కూడా ఎడమ చేతివాటమేనని ప్రతిభా స్కూల్ డైరెక్టర్ సుభాష్ రెడ్డి తెలిపారు. ఎడమచేతి వాటం గల వారందరినీ సమావేశపరిచి కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సరోజా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సింధుషారెడ్డి, సత్యనారాయణ పాల్గన్నారు.

నిర్వాసితుల భూమి కబ్జా


నిరసన తెలుపుతున్న నిర్వాసితులు..

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని స్వర్ణ వారి గూడెంలో పోలవరం ముంపులో భాగంగా వేలేరుపాడు మండలంలోని కన్నాయిగుట్ట గ్రామ నిర్వాసితులకు ప్రభుత్వం 2016లో అర్అండ్ఆర్ ప్యాకేజీలో కొన్ని ఎకరాల భూమిని పంపిణీ చేసింది. సర్వే నంబర్ 47/1లో 2 ఎకరాల 58 సెంట్ల భూమిని మూయిబోయిన నారాయణమ్మకు కేటాయించారు. అప్పటి నుంచి వారు ఆ భూమిలో సాగులో ఉంటున్నారు. గత రెండు సంవత్సరాల నుంచి ఆ భూమిలో స్థానిక గిరిజనులు కొంతమంది కోర్ట్ ఆర్డర్ వుందని, ఆ భూమిలో మాకు హక్కులు వున్నాయని, మా భూమిని కబ్జా చేయడానికి చూస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులకు తెలిపినా ఫలితం లేకపోవడంతో, సోమవారం గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి మా భూసమస్య వెంటనే పరిష్కరిచాలని, మా భూమిని కబ్జా చేయాలని చూస్తున్న కబ్జా గాళ్లపై చర్యలు తీసుకోవాలని, లేనిచో ఇక్కడ నుంచి దూకి చనిపోతామంటూ బెదిరింపులు చేశారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సంఘటనతో ఉలిక్కిపడ్డ రెవెన్యూ, తహశీల్దార్ సుందర్ సింగ్, ఎస్ఐ చంద్రశేఖర్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని వారిని శాంతింపజేశారు. వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆర్‌డిఒతో మాట్లాడి భూమికి ప్రొటెక్షన్ కల్పిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించి వారు ట్యాంక్ నుంచి కిందకు దిగారు.


వాటర్ ట్యాంక్‌పై నిరసన తెలుపుతన్న నిర్వాసితులు

సాగులో ఉన్న భూములు నిర్వాసితులకు కేటాయించడం దుర్మార్గం

మండలంలో సాగు చేసుకుంటున్న ఆదివాసీ భూములను తప్పుడు రికార్డు పత్రాలతో రెవెన్యూ అధికారులు నిర్వాసితులకు కేటాయిస్తున్నారని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వర్ణ వారి గూడెం, పాములవారిగూడెం గ్రామస్తులైన గిరిజనులు, ఎస్‌టి కోయ అయినటువంటి ఆదివాసీలు గుజ్జు నరసింహారాజు, గుజ్జు వరలక్ష్మి, పూసం ప్రభాకర్, బరగడ కాంతమ్మ 47/1, 47/2 గల సర్వే నెంబర్లు 4 ఎకరాల భూమిని గత 30 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్నామన్నారు. వీటికి సంబంధించి 2003 సంవత్సరంలో పట్టా, 2008లో పన్ను రసీదులు, 2014లో ఎస్‌టిసి కోర్ట్ ఆర్డర్, పన్ను రసీదులు, 2022లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆర్డర్ కూడా కలదు. అయినప్పటికీ 2017వ సంవత్సరం గాను పోలవరం నిర్వాసితులకు ఈ భూములను తప్పుడు పద్ధతిలో ఇవ్వడం జరిగింది. ఈ భూములు ఎప్పటినుంచో తాము సాగు చేసుకుంటుంటే నిర్వాసితులకు రెవెన్యూ అధికారులు తప్పుడు పద్ధతిలో వారికి కేటాయించారంటున్నారని తెలిపారు.

చెక్కపల్లిలో 'నా దేశం - నా భూమి'

ప్రజాశక్తి - ముసునూరు

స్వాతంత్ర్య సమరయోధులను గౌరవించడం మన సంప్రదాయమని ముసునూరు మండల ఎంపిడిఒ జి.రాణీ తెలిపారు. సోమవారం మండలంలోని చెక్కపల్లి గ్రామసచివాలయం నందు 'నా దేశం - నా భూమి' కార్యక్రమంలో భాగంగా వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు, రక్షణ సిబ్బంది, ఆర్మీ, సాయుధ, నౌక, వైమానిక దళాలకు చెందినవారు, పోలీసు వారికి సంబంధించిన కుటుంబసభ్యులను సోమవారం గౌరవించడం, సన్మానించడం, ఆగస్టు స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో భాగంగా చేయడం శుభపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు, గ్రామ సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ధర్నాతో సిఆర్ఆర్‌లో ఫీజు రద్దు : పిడిఎస్‌యు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

సర్ సిఆర్ రెడ్డి డిగ్రీ కళాశాలలో అక్రమంగా వసూలు చేస్తున్న కాండినేషన్ ఫీజులను రద్దు చేయాలని పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించగా యాజమాన్యం దిగివచ్చి రద్దు చేసిందని సంఘం జిల్లా అధ్యక్షులు కాకి నాని తెలిపారు. కాండినేషన్ ఫీజులు తగ్గించాలని కళాశాల కరస్పాండెంట్ ఆఫీసు ముందు పిడియస్‌యు ఆధ్వర్యలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకి నాని మాట్లాడుతూ సిఆర్ రెడ్డి కళాశాల యాజమాన్యం విద్యార్థులను దోపిడీ చేయడమే ధ్యేయంగా పెట్టుకుందన్నారు. కళాశాల విద్యార్థులకు కాండినేషన్ పేరుతో విపరీతంగా దోపిడీ చేస్తుందని, యూనివర్సిటీ రూల్స్‌కి వ్యతిరేకంగా రూ.500 నుంచి రూ.2వేలు వసూలు చేస్తున్నారని నాని తెలిపారు. మూడు గంటల పాటు సాగినటువంటి ఈ ధర్నా ఫలితంగా యాజమాన్యం కాండినేషన్ ఫీజు రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం జరిగిందని జిల్లా అధ్యక్షుడు కాకి నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి ఎం.జానకి రామ్, అధ్యక్షుడు ఎం.క్రాంతి, ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లెళ్లగూడెంలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - పోలవరం

జిల్లెల్లగూడెం సచివాలయ పరిధిలో రెడ్డి కుంకాల, పాత కుంకాల, కొత్త కుంకాల, ముత్యాలరావుపేట, జిల్లేలగూడెం గ్రామాల్లో 179వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని స్వయంగా తెలుసుకుని, పథకాలు అందుతున్న వారికి వాటి గురించి వివరించి, పథకాలు రాని వారికి వెంటనే వచ్చేలా చెయ్యాలని అధికారులను కోరారు. గ్రామంలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సూచించారు. గ్రామంలో ఎంఎల్‌ఎకి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎంపిపి సుంకర వెంకట రెడ్డి, ఎంపిడిఒ జి.శ్రీను, జడ్‌పిటిసి కలుం హేమ కుమారి, మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ, వైస్ ఎంపిపి, స్థానిక ఎంపిటిసి, సర్పంచిలు, అధికారులు, వాలంటీర్లు, సచివాల సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి - ముసునూరు

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధించాలంటే జగన్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాల్సిన అవసరం ఉందని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెం గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 77వ స్వాతంత్ర్య దినోత్సవం దేశం మొత్తం జరుపుకుంటున్నా ఆంధ్రాలో మాత్రం గ్రామ స్వరాజ్యం మాయమైందన్నారు. పంచాయతీ ప్రథమ పౌరులు జాతీయస్థాయిలో తమ ఆవేదనను వెళ్లగొక్కుతున్నారన్నారు. పంచాయతీలు దొంగలు పడ్డారని తమకు రావాల్సిన 14, 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి రూ.8,500 కోట్ల నిధులు కేంద్ర ప్రభుత్వం పంచాయతీ నిధులకు కేటాయిస్తే జగన్ వాటిని దోచుకుంటున్నారని సర్పంచిలే ఆరోపిస్తున్నారంటే జగన్ దోపిడీ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కందుల పిచ్చయ్య, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్మాణ కార్యదర్శి గద్దె రఘుబాబు, సర్పంచి పులిబళ్ల సత్యనారాయణ, మేదరమెట్ల సురేంద్ర, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, కాళ్ల మండలం, ఏలూరుపాడు, గాంధీనగర్, డో.నెం.8-55 కాశిన నాగమణి, తండ్రి: లక్ష్మయ్య దస్తావేజు నెం. 558/1982 మరియు కాశిన క్రిష్ణకుమారి భర్త: నాగేశ్వరరావు దస్తావేజు నెం. 1161/2023 గల రెండు దస్తావేజులు ది.11-08-2023న ఏలూరుపాడు నుండి భీమవరం జిరాక్స్ నిమిత్తం ఆటోలో వెళ్ళుచుండగా దస్తావేజులు పడి పోయినవి. దొరికినవారు ఈ క్రింది నెంబర్‌కి తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

కాశిన క్రిష్ణకుమారి
డో.నెం.8-55, గాంధీనగర్,
ఏలూరుపాడు, కాళ్ళ మండలం,
ప.గో. జిల్లా. సెల్ :80080 21217